క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రసన్న



కొడవలూరు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు కొడవలూరులో గురువారం రాత్రి ఇచ్చిన ఇఫ్తార్ ఇందులో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. డీసీఎమ్మెఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, ముస్లింలు పాల్గొన్నారు.

బాబామందిరంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం బాబాకు అభిషేకాలు, అలంకరణ, అష్టోత్తర, సహస్ర నామ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తులు బాబా భజనలు చేశారు. రాత్రి స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

గంజాయి సేవించినా నేరమే : ఎస్పీ



నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయిస్తేనే కాదు..సేవించినా జైలు ఊచలు లెక్కించాల్సిందేనని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల తో గురువారం ఆయన మాట్లాడారు. మాదకద్రవ్య రహిత జిల్లాగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి దా డులు చేస్తున్నామని పేర్కొన్నారు. గంజాయికి బానిసై నిరంతరం సేవిస్తున్న వారిపై సైతం కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వారం వ్యవధిలో ఆరుగురిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపామని వివరించారు. గంజాయి విక్రయాలు, రవాణాపై 14500, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

సిబ్బందికి అభినందన

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా, వినియోగదారులను అరెస్ట్ చేసి రూ 15.83 లక్షల విలువజేసే గంజాయి, కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ టీమ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, నెల్లూరు – 1, కావలి ఇన్‌స్పెక్టర్లు కిశోర్, శ్రీనివాసరావు, పోలీస్ టీమ్ ఎస్సై బాలకృష్ణ, ఆర్ఎస్సై గోపీనాథ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. త్వరలోనే వీరికి రివార్డులను అందజేయనున్నామని వెల్లడించారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకూడదు

నెల్లూరు(బారకాసు): రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశాన్ని మేయర్ స్రవంతి గురువారం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తాగునీటి ఎద్దడి తలెత్తకూడదని, నగరంలోని అన్ని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలని పేర్కొన్నారు. అవసరమైన డివిజన్లలో ట్యాంకర్ల ద్వారా నీటిని నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్లు, తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): బాలిక అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఒడిశాకు చెందిన ఓ కుటుంబం ఉపాధి నిమిత్తం నెల్లూరుకు రెండేళ్ల క్రితం వచ్చింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలకు కు మార్తె హాజరయ్యారు. ప్రస్తుతం సెలవులు కా వడంతో ఇంట్లోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పక్క వీధిలోని బంధువుల ఇంటికెళ్లొస్తానని చెప్పి బుధవారం ఆమె వెళ్లారు. అనంతరం రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో దర్గామిట్ట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. కాగా తమ కుమార్తె మూడు నెలలుగా అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో ఫోన్లో మాట్లాడుతుండగా మందలించామని, అదృశ్యం వెనుక అతని ప్ర మేయం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నా రు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సర్కారు బడులకు రక్షణ

- జెడ్పీ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్
- జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న హెచ్‌ఎంలు

మండలం	హైస్కూళ్ల సంఖ్య
ముత్తుకూరు	6
మనుబోలు	6
పొదలకూరు	11
వెంకటాచలం	8
తోటపల్లిగూడూరు	5



బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ధ్వంసం చేసిన ట్రీ గార్డులు(ఫైల్)



ముత్తుకూరు హైస్కూల్ కిటికీ అద్దాన్ని ధ్వంసం చేసిన దుండగులు(ఫైల్)

ముత్తుకూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మే 1వ తేదీ నుంచి వాచ్‌మెన్ బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. జెడ్పీ హైస్కూళ్లకు ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్ లేరు. దీంతో పలు హైస్కూళ్లలో ఎన్నో సార్లు చోరీలు జరిగాయి. కంప్యూటర్లు, ఇతర విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయి. హైస్కూళ్ల గదులు రాత్రి వేళ మందుబాబులు, జూదరుల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మద్యం మత్తులో ఆస్తులు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన ఘటనలు కూడా చాలా ఉన్నాయి. ఇవేకాకుండా పశువులు చొరబడి నీడనిచ్చే మొక్కలను, పచ్చదనాన్ని ధ్వంసం చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. వీటన్నిటినీ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరించారు. సెలవు రోజుల్లో సైతం హైస్కూళ్లకు వచ్చి పరిస్థితి గమనించి వెళ్లే హెచ్‌ఎంలు చాలా మందే ఉన్నారు.

స్థానికులకే ప్రాధాన్యం

జెడ్పీ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హెచ్‌ఎంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.6,000 గౌరవ వేతనంపై నియమించే వాచ్‌మెన్ పోస్టుకు హైస్కూల్‌లో పనిచేసే ఆయా భర్త గానీ, వంట చేసే మహిళ భర్తకు గానీ తొలి ప్రాధాన్యం ఇచ్చారు. లేకుంటే 60 ఏళ్ల లోపు వయసున్న స్థానిక ఎక్స్ సర్వీస్ మెన్ గానీ, లేకుంటే పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని గానీ నియమించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ షరతుల ప్రకారం హెచ్‌ఎంలు తమ హైస్కూళ్లకు నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌ను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం



“జెడ్పీ హైస్కూళ్ల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. గతంలో పలుమార్లు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. మే 1వ తేదీ నుంచి వాచ్‌మెన్ బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నాం.

– యేటూరు చెంచురామయ్య, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, ముత్తుకూరు

రూ. 15.98 కోట్లతో రైతులకు రుణాలు



రైతుకు ట్రాక్టర్ తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పడుగుపాడు సొసైటీ పనిచేస్తోందని, రైతులకు విరివిరిగా రుణాలు అందజేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సొసైటీ ఆధ్వర్యంలో రూ.24 లక్షలతో నూతనంగా నిర్మించిన గోదామును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు సొసైటీ పరిధిలో రైతులకు ఇతర రుణాలు కలిపి రూ.15.98 కోట్లు అందజేసినట్లు తెలిపారు. తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించి మరింత రుణం తీసుకొని అభివృద్ధి చెందాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకొనేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గోదాములు నిర్మించామన్నారు. రైతుల కోసం సొసైటీ పరిధిలోనే ఎరువుల విక్రయం, బంగారు ఆభరణాలపై రుణాలు, లాకర్ సౌకర్యం ఉన్నాయని, ఇనమడుగు గ్రామంలో నూతనంగా పెట్రోలు బంకు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో రైతుకు ట్రాక్టర్‌ను రుణం కింద మంజూరు చేశారు. అందుకు సంబంధించిన తాళాలు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం మధు, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, డీసీఓ సుధాభారతి, ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ డీటీ కృష్ణప్రసాద్, సొసైటీ బ్యాంక్ మేనేజర్ సుధాకర్, డైరెక్టర్లు జనార్దన్, అంబటి ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు

ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పీఆర్‌ఆర్ కాలనీలో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.61 లక్షలతో ప్రతి ఇంటికి ఏర్పాటు చేసిన కుళాయిలను, అదేప్రాంతంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఏఎంఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు మరువలేనివి



అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

పొదలకూరు: విధి నిర్వహణలో అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సేవలు మరువలేనివని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కె.శివనాయక్ అన్నారు. గురువారం పొదలకూరులో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో అగ్నిప్రమాదాల నివారణపై పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ వ్యాపారులు అగ్నిమాపక చట్టాలను తెలుసుకుని నిబంధనల మేరకు వ్యాపారాలు చేయాలని సూచించారు. అగ్నిప్రమాదాలపై ప్రాథమికంగా కొంత అవగాహన ఉంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి టి.విజయవరకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు భేష్



అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న పోర్టు సీఓఓ సంజయ్

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో అగ్నిమాపక సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పోర్టు సీఓఓ సంజయ్ కొత్త అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యాస్ పైప్‌లైన్లు, పెట్రోల్ బంకుల్లో జరిగే అగ్నిప్రమాదాలను చాకచక్యంగా నివారించాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆధునిక అగ్నిమాపక పరికరాలను ఆయన పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక హెడ్ రవీంద్రనాథ్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కర్, రామకృష్ణ, మనోహరబాబు పాల్గొన్నారు.

బైక్ ఆటోను ఢీకొని ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్ ఆటోను ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన షేక్ కరీముల్లా, మున్వర్ గురువారం సాయంత్రం కసుమూరు దర్గాకు వచ్చారు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కసుమూరు మలుపురోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన ఆటోను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కరీముల్లా, మున్వర్‌లకు స్వల్పగాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన ప్రాథమిక పాఠశాల, కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు జరుగుతున్న పరీక్షలను ఎంఈఓ జి.వసంతకుమారి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదుతున్న విద్యార్థులు తొలిసారిగా ఓఎంఆర్ షీట్లలో వార్షిక పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. మండలంలో 4,100 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట హెచ్‌ఎంలు ఇందిరాదేవి, ఓబులేసు ఉన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక భవిత కేంద్రంలో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు రంజాన్‌ను పురస్కరించుకుని గురువారం పండ్లు, సేమియాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సహార ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు రంజాన్‌ను పురస్కరించుకుని విద్యార్థులకు సేమియాలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు యస్దానీబాషాను అభినందించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి, రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

పొదుపు యానిమేటర్‌పై ఫిర్యాదు

నెల్లూరు (అర్బన్): పొదుపు ద్వారా తాము తీసుకున్న రుణానికి సంబంధించి చెల్లించిన మొత్తాన్ని బ్యాంకులో జమ చేయకుండా గ్రామ యానిమేటర్ స్వాహా చేశారని కలువాయి మండలం రామన్నగారిపల్లికి చెందిన వెంగమాంబ పొదుపు సంఘ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ సాంబశివారెడ్డికి గురువారం ఫిర్యాదు చేసిన అనంతరం వారు మాట్లాడారు. రూ.70 వేల చొప్పున రూ.ఏడు లక్షల రుణాన్ని ఏపీజీబీ ద్వారా 2021 ఫిబ్రవరిలో తీసుకున్నామన్నారు. దీనికి సంబంధించిన నెల వాయిదాలను వీఓఏ లక్ష్మీదేవికి చెల్లిస్తున్నామని, అయితే బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

గండికోటకు పూలే పురస్కారం



సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గండికోట సుధీర్‌కుమార్‌కు పూలే పురస్కారం లభించింది. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల్లో అక్షరరాస్యతను పెంపొందించేందుకు చేసిన కృషికి గాను ఆంధ్రప్రదేశ్ పూలే టీచర్స్ ఫెడరేషన్ పూలే పురస్కారాన్ని ఈ నెల 16వ తేదీన తిరుపతిలో అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గండికోటను బుచ్చిరెడ్డిపాళెంలో ఎంపీడీఓ నరసింహరావు, ఎంఈఓ దిలీప్, ఉపాధ్యాయులు అభినందించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

పొదలకూరు: గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 64 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు ఉంటే తెలిపాలని కోరారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలాన్ని నుడాలో చేర్చడం వల్ల 5,100 పక్కా ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.కసనానాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్యలు లేవన్నారు. ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లో అదనపు బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఏఓ వాసు, ఇరిగేషన్ ఏఈలు జానకిరామిరెడ్డి, అనిల్‌కుమార్, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మధుసూదన్, హెచ్ఓ ఆనంద్ ఆయా శాఖల పురోభివృద్ధిపై సభ్యులకు వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, వైస్ ఎంపీపీ సోమా అరుణ, పలువురు అధికారులు, పొదలకూరు సర్పంచ్ చిట్టెమ్మ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబ్ సీఐ సూర్యనారాయణ

బుచ్చిరెడ్డిపాళెం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ సూర్యనారాయణ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువ మంది మాదక ద్రవ్యాలకు బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉంటే మంచిదని తెలిపారు. కార్యక్రమం సెబ్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే రక్ష

- ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా రూ.3.50 లక్షల వితరణ



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పేద ప్రజలకు రక్ష అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పీఆర్ కాలనీలో జరిగిన ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో 65,825 గడపలకు వెళ్లి ప్రజలతో మమేకమైనట్లు తెలిపారు.

రూ.3.50 లక్షల వితరణ

కోవూరులో 3 రోజులపాటు నిర్వహించిన ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో పలువురికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. వారిలో వెల్లంపాటి యానమ్మకు రూ.10 వేలు, సుధాకు రూ.20 వేలు, శ్రీవైష్ణవికి రూ.40 వేలు, దావనికి రూ.20 వేలు, వికాస్‌కు రూ.40 వేలు, చంద్రమౌళికి రూ.20 వేలు, ఆదిశేషమ్మకు రూ.20 వేలు, దాసికి రూ.25 వేలు, రాజమ్మకు రూ.20 వేలు, వెంకటరమణయ్యకు రూ.10 వేలు, లక్ష్మికి రూ.20 వేలు, శాలినికి రూ.40 వేలు, వలంటీర్ శ్రీలతకు రూ.20 వేలు అందజేశారు. వీరికి వివిధ రకాల ఆర్థిక సమస్యలు ఉండడంతో వాటిని తెలుసుకున్న ఎమ్మెల్యే సాయం అందించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ప్రసాద్, సుబ్బారెడ్డి, కృష్ణ, రమేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో వెలసిన శ్రీత్రిపురాంతక స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఉభయకర్తలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వాడవాడలా ‘మా నమ్మకం నువ్వే జగన్’



బుచ్చిరెడ్డిపాళెం: 16వ వార్డులో ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కౌన్సిలర్



కోవూరు: వావిళ్ల గ్రామంలో..



మనుబోలు: జట్ల కొండూరు ఎస్సీకాలనీలో..

బుచ్చిరెడ్డిపాళెం: ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమాన్ని గురువారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ముమ్మరంగా చేపట్టారు. 16వ వార్డులో కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి వారి అనుమతితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఉన్న స్టిక్కర్‌ను అంటించారు. అలాగే అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

విశేష స్పందన

కోవూరు(విడవలూరు): ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమానికి అన్ని గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది. గురువారం మండలంలోని వావిళ్ల గ్రామంలో స్థానిక నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రమ, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, పెంచలయ్య, అంకబాబు, వలంటీర్లు యామిని, లోహిత్, అజేయ్, కల్యాణి, కావ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జట్ల కొండూరు ఎస్సీకాలనీలో..

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు ఎస్సీ కాలనీలో గురువారం ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం ఆధ్వర్యంలో ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గృహ యజమానుల అనుమతితో ఇంటికి, ఫోన్‌కు సీఎం చిత్రం ఉన్న స్టిక్కర్‌ను అంటించారు. కార్యక్రమంలో రమేష్, నాగరాజు, శివ, రాజగోపాల్, శ్రీనివాసులు, క్రిష్ణయ్య, వెంకటరావు, పెంచలయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.